
క్లుప్తంగా

ఎస్టీ కాలనీలో మంచి నీటి పథకం ఏర్పాటుకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

దొరవారిసత్రం : కొత్తపల్లి పంచాయతీ కలుజుమిట్ట ఎస్టీ కాలనీలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టారు. కలుజుమిట్ట కాలనీలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఐదు రోజుల క్రితం సాక్షి దినపత్రికలో 'సమస్యలతో సతమతం' అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉమామహేశ్వరి స్పందించారు. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి బోరు వేయడంతోపాటు పైపులైన్ ఏర్పాటుచేసేందుకు రూ.5 లక్షలతో జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపినట్టు తెలిపారు. ప్రస్తుతం కొత్తపల్లిలో ఆర్వో వాటర్ ప్లాంట్ ప్రారంభించినట్టు తెలిపారు. ఇక్కడి నుంచి గిరిజనులు నీళ్లు తీసుకెళ్లేలా చర్యలు తీసుకున్నామన్నారు.

వైభవంగా నాగార్పమ్మ గ్రామోత్సవం


ప్రత్యేక అలంకరణలో నాగార్పమ్మ

ఓజిలి: ఓజిలి గ్రామంలో నాగార్పమ్మ జాతరలో రెండో రోజు అమ్మవారికి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పొంగళ్లు పెట్టారు. రాత్రి అమ్మవారి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

ఆంజనేయుడికి తమలపాకులతో పూజ


తమలపాకు పూజల్లో పాల్గొన్న నాయకులు, ఉభయకర్తలు

చిల్లకూరు : తీరప్రాంతంలోని తమ్మినపట్నంలోవున్న అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి తమలపాకులతో పూజలు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. ముందుగా స్వామి వారికి విశేష అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం తమలపాకుల పూజ చేశారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉభయకర్తలుగా కోట సతీష్ కుటుంబ సభ్యులు వ్యవహరించారు. మత్స్యకార నాయకులు బక్తాని రామయ్య, మేకల వెంకయ్య, నాగూర్, కోట రమణయ్య, కొప్పాల సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీలకు ప్రత్యేక ఆధార్ కేంద్రాలు

కోట: తీరప్రాంత గ్రామాల్లోని ఎస్టీల కోసం రెండు రోజుల పాటు ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో దిలీప్‌కుమార్ తెలిపారు. కొత్తపట్నం సచివాలయంలో 26, 27 తేదీలు, సిద్ధవరం సచివాలయంలో 28, 29 తేదీల్లో ఆధార్ కేంద్రాలు పనిచేస్తాయని వెల్లడించారు. కొత్తపట్నం సచివాలయ పరిధిలో గుర్తించిన 151 మంది, సిద్ధవరంలో 88 మందికి ఆధార్ కార్డులు మంజూరు చేస్తామని తెలిపారు.

లక్ష్మినరసింహస్వామికి ప్రత్యేక పూజలు


భక్తులకు అన్నదానం చేస్తున్న దాతలు

బాలాయపల్లి(సైదాపురం) : మండలంలోని అలిమిలి గ్రామ సమీపంలో ఉన్న కనుమరాయ కొండపై వెలసిన శ్రీలక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. పరిసర ప్రాంతాల్లోని భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఓజిలి మండలం వజ్జవారిపాళెం గ్రామానికి చెందిన కూటూరి రమణారెడ్డి, నిర్మల భక్తులకు అన్నదానం చేశారు.

చెన్నకేశవస్వామి ఆలయంలో..

వాకాడు : మండల కేంద్రమైన వాకాడులో వున్న శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన అర్చకులు రమేష్‌శర్మ స్వామి వారిని వివిధ పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే కొండూరుపాళెంలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ధర్మకర్త సన్నారెడ్డి చంద్రభూషణ్‌రెడ్డి, శైలజ దంపతులు పూజలు, అన్నదానం చేశారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి


వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ నాగబాబు

వాకాడు : తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్‌ఐ నాగబాబు తెలిపారు. ఆయన శనివారం రాత్రి వాకాడులో పలుచోట్ల వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్‌పై వాహనదారులకు అవగాహన కల్పించారు. వాహనాల పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని, డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

దెబ్బతిన్న రోడ్డు



కలువాయి(సైదాపురం) : కలువాయి మండలం రాజుపాళెం సమీపంలోని తెలుగు గంగ కాలువకు పలుచోట్ల రంధ్రాలు పడి నీరు లీకేజీ కావడంతో ఈ నెల 14న పరమానంద ఆశ్రమం వద్ద రోడ్డు దెబ్బతినింది. పక్కన ఏర్పాటుచేసిన తాత్కాలిక మట్టి రోడ్డు కుంగడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. దీనికితోడు కండలేరు నుంచి సోమశిల నుంచి రెండో పంటకు 6వ గేటు ద్వారా 2,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. డ్యామ్‌పై నుంచి వెళ్లే రోడ్డులో పెద్ద వాహనాల రాకపోకలను నిషేధించారు. దీంతో సోమశిల-కలువాయి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

శిథిలావస్థలో..



ఓజిలి: స్థానిక తహసీల్దార్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీన్ని 30 ఏళ్ల క్రితం నిర్మించారు. గోడలు పగుళ్లు వచ్చాయి. పైకప్పు పెచ్చులు ఊడి కమ్మీలు కనిపిస్తున్నాయి. ఇటీవల తహసీల్దార్ గది సీలింగ్ ఊడి పడిపోయింది. అలాగే డీటీ, సర్వేయర్, కంప్యూటర్ ఆపరేటర్ విధులు నిర్వహించే గదులు అధ్వానంగా మారాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి భవనాన్ని తొలగించి కొత్తది నిర్మించాలని కోరుతున్నారు.

అసంపూర్తి పనులు



దొరవారిసత్రం : దొరవారిసత్రంలోని కేజీబీవీని అభివృద్ధి చేయడానికి గత ప్రభుత్వం మనబడి నాడు-నేడు కింద ఎంపిక చేసింది. రూ.60 లక్షలు మంజూరు చేసింది. వాటితో తాగునీటి వసతి, విద్యుత్ సౌకర్యంతోపాటు అదనపు గదులు, వంట చేసేందుకు రేకుల షెడ్ నిర్మాణాన్ని చేపట్టింది. పనులు కొంతవరకు జరిగాయి. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులు ఆగిపోయాయి. వాటిని పట్టించుకోకుండా కొత్తగా ఇతర పనులు చేపడుతుండడంపై పలువురు విమర్శిస్తున్నారు. అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

శిక్షణా కాలం


స్టేడియంలో హాకీ శిక్షణ పొందేందుకు సిద్ధంగా ఉన్న పిల్లలు, యువకులు


క్రికెట్ శిక్షణలో భాగంగా వామప్ చేస్తున్న చిన్నారులు


యోగా సాధన చేస్తున్న చిన్నారులు

- పిల్లలకు శిక్షణ ఇస్తున్న క్రీడాకారులు
- ఆసక్తి చూపుతున్న పిల్లలు
- ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు

చిల్లకూరు: వేసవి సెలవుల్లో తమ పిల్లలకు ఏదో ఒకటి నేర్పించాలని అనుకుంటారు. ఇందులో భాగంగా గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో క్రికెట్, హాకీ, వాలీబాల్, ఫుట్‌బాల్, యోగా, బాడీ బిల్డింగ్ తదితరాలపై శిక్షణ ఇస్తున్నారు. అదేవిధంగా ప్రయివేటు సంస్థల్లో ఆర్చరీ, కుస్తీ, కర్రసాము, కరాటే, జూడో, కుంగ్‌ఫూ లాంటివి నేర్పిస్తున్నారు. పలు నృత్య, అభినయ పాఠశాలల్లో నృత్యం నేర్చుకునేందుకు పిల్లలు ఉత్సాహం చూపుతున్నారు. ఫీజు ఎక్కువగా ఉన్నప్పటికీ తల్లిదండ్రులు వెనకాడడం లేదు. గూడూరు పట్టణంలో పలు రంగాల్లో శిక్షణ పొందిన ఎంతో మంది క్రీడాకారులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. దీంతో పిల్లలు క్రీడలు నేర్చుకునేందుకు ఉత్సాహం చూపుతున్నారు.

జగన్ అందించిన పథకాలను వివరించండి



మేరిగ మురళీధర్‌ను శాలువ కప్పి సత్కరిస్తున్న మహిళా విభాగం నేతలు, గూడూరు ఎంపీపీ, నాయకులు


మేరిగ మురళీధర్‌ను కలిసిన జరుగుమల్లి నాయకులు

చిల్లకూరు/కోట : వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన పథకాల గురించి ప్రజలకు వివరించాలని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్ తెలిపారు. ఆయనను శనివారం గూడూరు పట్టణానికి చెందిన మహిళా విభాగం నేతలు, కోట మండలం జరుగుమల్లికి చెందిన నాయకులు, గూడూరు ఎంపీపీ బూదూరు గురవయ్య, 24 సొసైటీ అధ్యక్షుడు అట్ల శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి కొండూరు సునీల్‌రెడ్డి కలిశారు. శాలువా కప్పి సత్కరించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ మహిళలకు సముచిత స్థానం ఇచ్చిందన్నారు. మహిళ సంక్షేమానికి పలు పథకాలను అమలు చేసిన విషయాన్ని వివరించాలన్నారు. తద్వారా వచ్చే ఎన్నికల్లో మహిళలు పార్టీకి అండగా ఉండేలా చూడాలన్నారు. కోట మండలానికి చెందిన ఉలస కస్తూరయ్య, జరుగుమల్లి బుజ్జయ్య, పాముల సురేంద్ర, గూడూరు పట్టణంకు చెందిన మహిళా విభాగం నేతలు దీప్తి, కళావతి, సుజన, ప్రవల్లిక, లక్ష్మీసుధ, ఉమ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


మాట్లాడుతున్న న్యాయమూర్తి విష్ణువర్మ

వెంకటగిరి రూరల్ : ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని వెంకటగిరి జూనియర్ సివిల్ జడ్జి విష్ణువర్మ తెలిపారు. మండలంలోని వల్లివేడులో శనివారం న్యాయ విజ్ఞాన చైతన్య సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ ప్రస్తుతం అమలవుతున్న చట్టాలను తెలుసుకోవాలని సూచించారు. ఈజీ మనికి అలవాటు పడి కొందరు నేరాల బాట పడుతున్నారని తెలిపారు. చెడు వ్యసనాలు, చీటింగ్ తదితరాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. మహిళలు, బాలికల రక్షణకు ప్రత్యేక చట్టాలు అమలువుతున్నాయని, సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. బాల్య వివాహాల వల్ల అనేక అనర్థాలు కలుగుతాయని తెలిపారు. బాలికలు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నిర్మలమ్మ, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పి.రామ్‌ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ హేమగాంధీ, లోక్ అదాలత్ మెంబర్ సుంకర రాజేష్, రాజారావు, ప్యానల్ అడ్వకేట్ సునీత, సీఐ ఏవీరమణ, ఎస్‌ఐ సుబ్బారావు, ఏఎస్‌ఐ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం


మాట్లాడుతున్న ఎమెల్యే విజయశ్రీ

నాయుడుపేట టౌన్ : గిరిజనుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. ఆమె శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో గిరిజనుల సంక్షేమంపై వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో గిరిజన గ్రామాల్లో ప్రత్యేక నిధులతో అభివృద్ధి పనులు చేస్తున్నట్టు తెలిపారు. అంతేకాకుండా రూ.12 కోట్లతో అభివృది పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నట్లు వివరించారు. అర్హులకు పక్కా ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. అనంతరం అర్జీలు స్వీకరించారు. మాజీ జెడ్పీటీసీ పేరం శెట్టి శ్రీరామ్‌ప్రసాద్, మాజీ ఎంపీపీ తుపాకుల కన్నెమ్మ, ఎంపీడీవో సురేష్‌బాబు, ఉపాధి ఏపీడీ ప్రేమ్‌కుమార్, ప్రత్యేక అధికారి జీ గోవర్ధన్ రెడ్డి, సీడీపీవో ఉమామహేశ్వరి, ఏపీఎం ఉమాదేవి, ఎంఈవో మునిరత్నం, ఐటీడీఏ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భార్యను హత్య చేసిన భర్త కోసం విస్తృత గాలింపు

నాయుడుపేట టౌన్ : భార్యను హత్య చేసిన రాపూరి శ్రీనివాసులు కోసం విస్తృతంగా గాలిస్తున్నట్టు సీఐ బాబి తెలిపారు. మండలంలోని మడపలం గ్రామ సమీపంలో కాలువ గట్టు వద్ద ఈ నెల 17వ తేదీ రాత్రి శ్రీనివాసులు తన భార్య వీణమ్మ(28)ను రాయితో కొట్టి హత్య చేసిన విషయం తెలిసిందే. మృతురాలి తల్లి తుపాకుల పెంచలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. నిందితుడు శ్రీనివాసులును పట్టుకునేందుకు సీఐ బాబి ఐడీ పార్టీ పోలీసులతో గాలింపు చర్యలు చేపట్టారు. తల్లి మృతి చెందడం, తండ్రి పరారు కావడంతో అభి(7), బత్తెయ్య(4), ఆదెయ్య (3) అనాథలుగా మిగిలారు. వారిని ఐసీడీఎస్ సీడీపీవో ఉమామహేశ్వరి సీడబ్ల్యూసీలో చేర్పించేందుకు చర్యలు చేపట్టారు. మృతురాలి తల్లి పెంచలమ్మ అందుకు ఒప్పుకోకుండా పిల్లలను తీసుకెళ్లిపోయింది. ఆమె చిట్టమూరు మండలంలో రొయ్యల గుంతల వద్ద ఉన్నట్టు అధికారులు గుర్తించారు. వారిని సీడబ్లూసీ అధికారులు సారధ్యంలో అన్ని విధాలుగా అదుకొనేల చర్యలు చేపడుతున్నట్లు సీడీపీవో తెలిపారు.

ఉపాధి కూలీలకు వసతులు కరువు

- ఎండకు ఇబ్బంది పడుతున్న కూలీలు
- కనిపించని ప్రథమ చికిత్స కిట్లు
- ఇళ్ల నుంచి తాగునీరు తెచ్చుకుంటున్న వైనం


వెంకటరెడ్డిపాళెంలో ఎండలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ఓజిలి: ఉపాధి కూలీలకు వసతులు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉండడంతో కూలీలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వారికి పనిచేసే ప్రదేశంలో తాగునీటితోపాటు నీడ కల్పించాలి. అలాగే ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలి. ఓజిలి మండలంలో ఎక్కడా వసతులు కల్పించిన దాఖలాలు లేవు. మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో 9,016 జాబ్‌కార్డులు ఉన్నాయి. 7,265 మంది పనులు చేస్తున్నారు. ప్రతి రోజూ 3 వేల మందికి పైగా కూలీలు పనుల్లో పాల్గొంటున్నారు. వారికి పనులు చేసే ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించలేదు. ప్రస్తుతం ఎండలు ఎక్కువగా ఉండడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎవరు ఎటుపోతే తమకేంటన్న నిర్లక్ష్య ధోరణిలో అధికారులు ఉన్నారని కూలీలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాల్సి ఉంది. ముఖ్యంగా కూలీలు పనిచేసే చోట తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచడం లేదు. కూలీలు ఇళ్ల నుంచి బాటిళ్లలో నీరు తెచ్చుకుంటున్నారు. గుడారాలు, టెంట్లు లేకపోవడంతో ఎండను తాళలేక చెట్ల కిందకు వెళ్లాల్సి వస్తోంది.

8 పంచాయతీల్లో క్షేత్ర సహాయకులు కరువు

మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో 8 పంచాయతీల్లో క్షేత్ర సహాయకులు లేరు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వెంకటరెడ్డిపాళెం, పెదపరియ, సగుటూరు, భట్లకనుపూరు, మానమాల గ్రామాల్లో టీడీపీ అనుకూలమైన వారిని నియమించుకున్నారు. అలాగే కొత్తచెరువు, చిలమానుచేను, పున్నేపల్లి గ్రామాల్లో క్షేత్ర సహాయకులు లేరు. వెంకటరెడ్డిపాళెం, ఆర్మేనిపాడు గ్రామాల్లో ఉపాధి నిధులు దుర్వినియోగం చేశారని సామాజిక తనిఖీలో డ్వామా పీడీ ఇద్దరిని విధుల నుంచి తొలగించారు. దీంతో ఉపాధి పనులు తూతూమంత్రంగా చేయిస్తున్నారు.

వసతులు కల్పిస్తున్నాం



ఉపాధి కూలీలకు వసతులు కల్పిస్తున్నాం. ఇళ్ల నుంచి తాగునీటిని తెచ్చుకుంటున్న కూలీలకు అదనంగా రూ.రెండు ఇస్తున్నాం. పనులు జరిగే ప్రాంతంలో వడదెబ్బ తగలకుండా టార్పాలిన పట్టలు ఏర్పాటు చేస్తున్నాం. కూలీలు ఎవరైనా అస్వస్థతకు గురైతే పీహెచ్‌సీలకు తరలించి వైద్యం అందిస్తున్నాం.

– విజయలక్ష్మి ఎంపీడీవో, ఓజిలి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చిల్లకూరు : విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగించే క్రమంలో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్టు ఏఈ బొలిగర్ల శేషాద్రి తెలిపారు. ఈ క్రమంలో కడివేడు, కమ్మవారిపాళెం, తిమ్మనగారిపాళెం, బూదనం, పత్రగుంట, నెలబల్లిరెట్టపల్లి, పున్నపువారిపాళెం, ఎగువరాజుపాళెం, తీపనూరు, ఓడూరు గ్రామాల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ ఉండదని తెలిపారు.

అభివృద్ధి పనుల పరిశీలన


చిట్టేడు ఎస్టీ గురుకుల పాఠశాలలో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న అధికారులు

కోట : చిట్టేడు ఎస్టీ గురుకుల పాఠశాలలో పీఎం శ్రీ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను శనివారం సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ గౌరీశంకర్ పరిశీలించారు. ఇక్కడ రూ.11 లక్షలతో కెమిస్ట్రీ ల్యాబ్, కిచెన్ షెడ్, గేమ్స్ కోర్టులు నిర్మిస్తున్నారు. వివిధ దశల్లో ఉన్న పనులను గౌరీశంకర్ పరిశీలించారు. పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు ఆడుకునేందుకు సదుపాయాలను మెరుగుపరుస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఏఎంవో శివశంకర్, ఎంఈవో మస్తానయ్య ఉన్నారు.

నేడు అంకమ్మ కొలుపు మహోత్సవం



సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురంలోని తూర్పు వీధిలోని అంకాళ పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆదివారం కొలుపు మహోత్సవం నిర్వహించనున్నారు. ఈ క్రమంలో శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి గ్రామోత్సవాన్ని ఘనంగా చేపట్టారు. ఆదివారం పొంగళ్లు, అన్నదానం చేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

సమష్టిగా మున్సిపాలిటీ అభివృద్ధి

- వాడివేడిగా కౌన్సిల్ సమావేశం
- సమస్యలపై కౌన్సిలర్ల ఆగ్రహం
- 53 అంశాలకు ఆమోదం


కౌన్సిల్ సమావేశం జరుగుతున్న దృశ్యం

వెంకటగిరి రూరల్ : కౌన్సిలర్లు, అధికారుల సమష్టి కృషితో మున్సిపాలిటీ అభివృద్ధి చేపట్టనున్నట్టు చైర్‌పర్సన్ నక్కాభానుప్రియ తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఇటీవల నిర్వహించిన అవిశ్వాస తీర్మానం వీగిపోయి చైర్‌పర్సన్‌గా మళ్లీ నెగ్గిన నక్కా భానుప్రియను కౌన్సిలర్లు అభినందించారు. అనంతరం 53 అంశాలతో కూడిన అజెండాకు కౌన్సిల్ ఆమోదించింది. 4వ వార్డు కౌన్సిలర్ ఎంఏ నారాయణ మాట్లాడుతూ కుమ్మరిగుంటలో కుక్కల దాడిలో పలువురు చిన్నారులు గాయపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని తెలిపారు. కుక్కల బెడదను నివారించాలని కోరారు. 16వ వార్డు కౌన్సిలర్ ధనియాల రాధ మాట్లాడుతూ తమ వార్డు పరిధిలోని బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలపై మూడు నెలల క్రితం కౌన్సిల్ సమావేశంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని మండిపడ్డారు. ఇందుకు సర్వేయర్ సుబ్రమణ్యం తగిన సమాధానం చెప్పకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య మాట్లాడుతూ మున్సిపాలిటీ ఆదాయాన్ని పెంచేందుకు పట్టణంలోని క్రాస్ రోడ్డు, బందెల్లదొడ్డి, కూరగాయల మర్కెట్ తదితర ప్రాంతాల్లో మున్సిపల్ క్లాంప్లెక్స్‌ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. 6వ వార్డు కౌన్సిలర్ మాడా జానకిరామయ్య మాట్లాడుతూ తమ వార్డులో వీధి దీపాలు వెలగడంలేదని ఆరోపించారు. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని వాపోయారు. స్పందించిన అధికారులు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

'పొజిషన్ సర్టిఫికెట్లకు లంచం అడుగుతున్నారు'


మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట మున్సిపాలిటీలోని సూళ్లూరులో స్థలాలకు పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వడానికి వీఆర్వో తిరుమలేశ్ లంచం అడుగుతున్నారని దళిత సంఘాల నేతలు ఆరోపించారు. వారు శనివారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. 1962లో అప్పటి ప్రభుత్వం సూళ్లూరులో సర్వే నెంబర్ 93-1లో స్థలాలు మంజూరు చేసిందని తెలిపారు. అప్పటి నుంచి అక్కడ ఇళ్లు నిర్మించుకుని నివాసం వుంటున్నామని తెలిపారు. ప్రస్తుతం ఇళ్లు శిథిలం కావడంతో పక్కా ఇళ్ల కోసం పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వాలని వీఆర్వోను ఆశ్రయించినట్టు తెలిపారు. లంచం ఇస్తేనే సర్టిఫికెట్లు ఇస్తున్నారని, ఇవ్వని వారికి పట్టా భూమి అని చెప్పి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. అతనిపై తహసీల్దార్, ఆర్‌డీవోకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోకపోతే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో అంబేడ్కర్ సేవా సమితి వ్యవస్థాపకులు పిట్ల చిన్న, ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ సంఘం సూళ్లూరుపేట అధ్యక్షుడు సాల్మన్‌రాజ్, పెళ్లకూరు మండల అధ్యక్షుడు హరిబాబు, వీసీకే అధ్యక్షులు మలిచి చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కలవకొండలో హుండీ లెక్కింపు


హుండీని కానుకలను లెక్కిస్తున్న అధికారులు, భక్తులు

చిల్లకూరు : మండలంలోని కలవకొండలోవున్న లక్ష్మీనరసింహ స్వామి ఆలయ హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను శనివారం ఆలయ ఈవో రవిక్రిష్ణ, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు ఆధ్వర్యంలో లెక్కించారు. ఈవో మాట్లాడుతూ హుండీలోని కానుకల వల్ల రూ.1,39,809ల ఆదాయం వచ్చిందన్నారు. ఈ మొత్తాన్ని ఆలయ ఖాతాలో జమ చేయనున్నట్టు తెలిపారు. అదేవిధంగా ప్రతి శనివారమూ స్వామివారికి పల్లకి సేవతో పాటు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిరంతరాయంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వామి వారికి శనివారం రాత్రి పల్లకి సేవను ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా గ్రామానికి చెందిన ఉడతా శ్రీనివాసులు, దేవసేనమ్మ, ఏరూరు గ్రామానికి చెందిన వెంకటక్రిష్ణ, బబిత వ్యవహరించారు.

భక్తి శ్రద్ధలతో నవగ్రహ హోమం


హోమం చేస్తున్న పురోహితులు

చిట్టమూరు : మండలంలోని ఎల్లూరులో రాజమునీశ్వర స్వామి, నాగార్పమ్మ వార్షిక వేడుకల్లో భాగంగా శనివారం నవగ్రహ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. యాగశాలలో సకల దేవతల కలశ స్థాపన, మండపారాధన, అగ్ని ప్రతిష్టాపన, మంగళహారతి తదితర పూజలు చేశారు. రాజమునీశ్వర స్వామి మూల విరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఆదివారం శిఖర ప్రోక్షణ, స్వామి వారి గ్రామోత్సవం, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తామని నిర్వాహకులు తెలిపారు.